ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక


Bullet Edition

గురువారం, 8 ఆగస్టు 2024 www.prajaaswaramdaily.com 4 PM


# జపాన్‌లో భారీ భూకంపం



టోక్యో, ఆగస్టు 8 (ప్రజాస్వరం): జపాన్ ను భారీ భూకంపం వణికించింది. గురువారం దక్షిణ తీర ప్రాంతంలో క్యుషు ద్వీపం సమీపంలో ఇది సంభవించింది. రిక్టర్ స్కేల్ పై దాని తీవ్రత 7.1 గా నమోదైందని జపాన్ వాతావరణ సంస్థ వెల్లడించింది. 30 కి.మీ. లోతులో భూకంప కేంద్రం నమోదైందని తెలిపింది. దాంతో అధికారులు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. క్యుషు, దగ్గర్లోని షికోకు ద్వీపాన్ని ఒక మీటరు ఎత్తుతో అలలు తాక్కొచ్చని ప్రజలను అప్రమత్తం చేశారు. అలాగే భూకంపకేంద్రం సమీపంలోని విమానాశ్రయం అద్దాలు దెబ్బతిన్నాయని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ ఏడాది మొదటి రోజే జపాన్ లో భూకంపం సంభవించిన సంగతి తెలిసిందే. దానిలో 200 మందిపైగా ప్రాణాలు కోల్పోయారు.



# పెద్దల సభలో గందరగోళం..

## వినేశ్ ఫొగాట్ డిస్ క్వాలిఫై అంశంపై దుమారం

### చర్చకు విపక్షాల పట్టు.. సభలో ఆందోళన.. వాకౌట్

### రాజ్యసభ చైర్మన్, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ అసహనం

### ఉద్దేశపూర్వకంగా తప్పుదారి పట్టిస్తున్నారని ఆగ్రహం

### సభ నుంచి వెళ్లిపోయిన చైర్మన్

న్యూఢిల్లీ, ఆగస్టు 8 (ప్రజాస్వరం): బడ్జెట్ సమావేశాల్లో భాగంగా నడుస్తున్న పార్లమెంట్ సమావేశాల సందర్భంగా రాజ్య సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. విపక్షాల తీరుపై రాజ్యసభ చైర్మన్, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ అసహనం వ్యక్తం చేశారు. సభలో సమస్యలపై చర్చించే సమయంలో సభను ఉద్దేశ పూర్వకంగా తప్పుదోవ పట్టిస్తున్నారని విపక్షాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సభ నుంచి వెళ్లిపోయారు. బుధవారం ఒలింపిక్స్ నుంచి 100 గ్రాముల అధిక బరువు కారణంగా రెజ్లర్ వినేశ్ ఫొగట్ డిస్‌క్వాలీపై అయిన విషయం తెలిసిందే. ఫైనల్ మ్యాచ్ ముందు ఇలా జరగడంతో భారత అభిమానులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వినేశ్ అనర్హతకు దారితీసిన పరిస్థితులపై చర్చకు విపక్షాలు పట్టుబట్టాయి. ఇందుకు ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ నిరాకరించారు. ఇది సందర్భం కాదని భారత క్రీడా అధికారులు చర్చలు జరుపుతున్నారని చెప్పుకొచ్చారు. అయినా వినకుండా రాజ్యసభల్లో చర్చించాల్సిందేనని విపక్ష పార్టీలు ఆందోళనకు దిగాయి. విపక్ష నేతల తీరుపై ఛైర్మన్ తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. 'వినేశ్‌పై అనర్హత పడినందుకు ప్రతిపక్షాల హృదయం మాత్రమే ద్రవిస్తున్నట్లు వారు మాట్లాడుతున్నారు. ఆ అమ్మాయి పరిస్థితి చూసి దేశం మొత్తం బాధపడుతోంది. కానీ, దీన్ని రాజకీయం చేస్తే అది ఆమెను అవమానపర్చినట్లే' అని ధన్‌ఖడ్ అన్నారు. దీంతో విపక్షాల సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. ఈ క్రమంలో విపక్షాల తీరుపై రాజ్యసభ చైర్మన్, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ అసహనం వ్యక్తం చేశారు. సభలో సమస్యలపై చర్చించే సమయంలో సభను ఉద్దేశ పూర్వకంగా తప్పుదోవ పట్టించే విదంగా ఉన్న విపక్షాల తీరుపై చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయన సభ నుంచి వెళ్లిపోయారు. దీంతో రాజ్యసభలో గందరగోళ వాతావరణం నెలకొంది. కాగా ఈ రోజు లోక్ సభ, రాజ్యసభలో వక్ బోర్డు సవరణ బిల్లును కేంద్ర ప్రవేశ పెట్టనుంది.

# లోక్‌సభలో రగడ

## సభ ముందుకు వక్ఫ్ చట్టం సవరణ బిల్లు

### లోక్‌సభ ముందుకు వక్ఫ్ చట్టం సవరణ బిల్లు

### ప్రవేశపెట్టిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు

### తీవ్రంగా ఖండించిన విపక్షాలు



న్యూఢిల్లీ, ఆగస్టు 8 (ప్రజాస్వరం): పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో వక్ఫ్ చట్టం సవరణ బిల్లును ప్రవేశపెట్టింది. ఆ చట్టంలో కీలక మార్పులు తెచ్చే దిశగా కేంద్రమంత్రి కిరణ్ రిజిజు దీనిని తీసుకువచ్చారు. దీని ద్వారా వక్ఫ్ పాలకవర్గాల్లో మరింత పారదర్శకత, జవాబుదారీతనం పెంచుతూ పాలనలో మహిళల భాగస్వామ్యం తప్పనిసరి చేయనున్నారు. ఈ మేరకు 1995 నాటి వక్ఫ్ చట్టంలో దాదాపు 40 సవరణలు చోటుచేసుకోనున్నాయి. ముస్లిం సమాజం నుంచి వస్తున్న డిమాండ్ల మేరకే ఈ మార్పులు చేస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెప్పాయి. కొత్త బిల్లు అమలులోకి వస్తే జిల్లా కలెక్టర్లు రూపొందించిన వాస్తవ అంచనా విలువల మేర వక్ఫ్ బోర్డులు తమ ఆస్తులను తప్పనిసరిగా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. భాజపా సర్కారు ఎప్పట్నుంచో ఈ సవరణల గురించి ఆలోచిస్తోందని, ఇది సరైన నిర్ణయం కాదని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఇదివరకే ఈ బిల్లును వ్యతిరేకించింది. ఈ బిల్లును తాజాగా విపక్షం తీవ్రంగా వ్యతిరేకించింది. రాజ్యాంగ విరుద్ధం అంటూ ఖండించింది. కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ బిల్లు దారుణం, రాజ్యాంగ స్ఫూర్తిపై దాడి, మతపరమైన విభజనను సృష్టిస్తుందని విమర్శించారు. ఈ సవరణ బిల్లును భాజపా మిత్రపక్షం జేడీయూ సమర్థించింది.

# మాజీ సీఎం బుద్ధదేవ్ భట్టాచార్య కన్నుమూత



న్యూఢిల్లీ, ఆగస్టు 8 (ప్రజాస్వరం): పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం బుద్ధదేవ్ భట్టాచార్య కన్నుమూశారు. గత కొంతకాలంగా శ్వాసకోశ సంబంధిత సమస్యలతో బాధపడుతోన్న ఆయన కోల్‌కతాలోని తన నివాసంలో గురువారం తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని సీపీఎం బెంగాల్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ సలీం వెల్లడించారు. 80ఏళ్ల భట్టాచార్య కోరిక మేరకు వైద్య పరిశోధనల కోసం ఆయన అవయవాలను దానం చేయనున్నారు. సీపీఎం ప్రధాన కార్యాలయంలో అనుచరులు నివాళులర్పించేలా భౌతికగాయాన్ని ఉంచనున్నారు. శుక్రవారం అంతిమయాత్ర జరగనుంది.

# తెలంగాణకు ఛార్లెస్ స్క్వాబ్




న్యూఢిల్లీ, ఆగస్టు 8 (ప్రజాస్వరం): పెట్టుబడుల సమీకరణ లక్ష్యంగా అమెరికాలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం వివిధ సంస్థల ప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఈ క్రమంలో తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు పలు ప్రముఖ సంస్థలు ఆసక్తి కనపరుస్తున్నాయి. తాజాగా ఫైనాన్షియల్ సర్వీసెస్ లో ప్రపంచంలో పేరొందిన చార్లెస్ స్క్వాబ్ కంపెనీ హైదరాబాద్ లో టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. భారత్ లోనే ఈ కంపెనీ నెలకొల్పే మొదటి సెంటర్ ఇదే కావటం విశేషం. అమెరికా పర్యటనలో భాగంగా డల్లాస్ బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబుతో చార్లెస్ స్క్వాబ్ కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ లు డెన్నిస్ హోవార్డ్, రామ బొక్కా సారథ్యంలో ప్రతినిధులు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా టెక్నాలజీ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుపై కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. హైదరాబాద్‌లో ఈ కేంద్రం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన సహకారం అందిస్తుందని ఈ సందర్భంగా వారికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. కంపెనీ కార్యకలాపాలను వేగవంతం చేసేందుకు అవసరమైన మార్గదర్శనం చేస్తామని చెప్పారు. తమ కంపెనీ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతుకు కంపెనీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు ఛార్లెస్ స్క్వాబ్ తుది అనుమతుల కోసం వేచి చూస్తోంది. త్వరలోనే తమ ప్రతినిధి బృందాన్ని హైదరాబాద్ కు పంపించనున్నట్లు తెలిపింది.

### డల్లాస్‌లో మహాత్ముడి విగ్రహానికి సీఎం నివాళి

డల్లాస్ నగరంలోని మహాత్మాగాంధీ మెమోరియల్ ప్లాజాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మంత్రి వర్గ సహచరులు డి.శ్రీధర్ బాబు, కోమటిరెడ్డిలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ విగ్రహానికి సీఎం నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మహాత్ముడి సేవలను ఆయన గుర్తు చేసుకున్నారు. కాగా డల్లాస్ లో ఏర్పాటు చేసిన ఈ గాంధీ విగ్రహం అమెరికాలోనే అతి పెద్దది కావడం విశేషం.

# కేటీఆర్ ఎన్ని పెట్టుబడులు తెచ్చారు?

## కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 8 (ప్రజాస్వరం) : భారాస ప్రభుత్వ హయాంలో కేటీఆర్ విదేశాల్లో పర్యటించి ఎన్ని కోట్ల పెట్టుబడులు తెచ్చారని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రానికి పెట్టుబడుల కోసం సీఎం రేవంత్‌రెడ్డి విదేశాలకు వెళ్తే దాన్ని కూడా వక్రీకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దిల్లీలో కాంగ్రెస్ ఎంపీలు మీడియా సమావేశం నిర్వహించారు. 'పదేళ్లలో కేటీఆర్ ఎన్నిసార్లు విదేశాలకు వెళ్లారు? ఎన్ని కోట్ల పెట్టుబడులు తెచ్చారు? గత ప్రభుత్వం అధిక వడ్డీలకు అప్పులు తెచ్చింది. తక్కువ వడ్డీలకు అప్పులిచ్చే ప్రపంచ బ్యాంక్ వంటి వనరులను వాడుకోలేదు. రాష్ట్రాన్ని భారాస అప్పుల పాల్జేసింది. ఆ పార్టీ నేతలు ప్రజల్ని మాయమాటలు చెప్పి తప్పుదోవ పట్టిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే మమ్మల్ని తప్పుబడుతున్నారు. ఎలా బద్నాం చేయాలనే ఆలోచనతోనే ముందుకెళ్తున్నారు. పార్టీలతో సంబంధం లేకుండా తెలంగాణలో పెట్టుబడి పెట్టేందుకు వచ్చే అందర్నీ ఆహ్వానిస్తున్నాం. గంజాయి, చీప్ లిక్కర్, డ్రగ్స్ మినహా అన్ని వ్యాపారాలకు అనుమతులు ఇస్తాం. ఉద్యోగాలు ఇవ్వడం.. సంపద పెంచడమే మా లక్ష్యం'' అని చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు.